సాక్షి శ్రీకాకుళం

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సమైక్యతా వారధి హిందీ

హిందీ పక్షోత్సవాలకు వేళయ్యింది. నేటి నుంచి ఈ నెల 28 వరకు జాతీయ హిందీ పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. - 8లో



ఆనందంలో అన్నదాత

వరుణుడు కరుణించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. - 8లో

16న జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో ఐసీఐసీఐ బ్యాంకు నేతృత్వంలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

టెక్కలి సబ్ కలెక్టర్‌గా నూరుల్ కమర్


నూరుల్ కమర్

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి నూరుల్ కమర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనను టెక్కలి సబ్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీహార్ రాష్ట్రం హరారియా జిల్లాకు చెందిన నూరుల్ కమర్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఈయన్ను గత ఏడాది అక్టోబర్‌లో పాలకొండ సబ్ కలెక్టర్‌గా నియమించారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేసిన టి.రాహుల్‌కుమార్ రెడ్డి గత నెలలో నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయిన సంగతి తెలిసిందే.

రిమ్స్‌లో కార్మ్ యంత్రం ఏర్పాటు


కార్మ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం: రిమ్స్ ఆస్పత్రిలో కంప్యూటర్ అసిస్టెడ్ రేడియో మోనిటరింగ్(కార్మ్) యంత్రాన్ని ఏర్పాటు చేశామని డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం ఈ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకలు ఎక్కడైనా విరిగితే యంత్రం ద్వారా కచ్చితమైన జాయింట్‌ను గుర్తించి ఆపరేషన్ చేసేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. గతంలోనూ ఈ తరహా యంత్రాలను ప్రభుత్వం అందజేసిందని, మలివిడతగా మరో రెండు యంత్రాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యంపై దృష్టి


విద్యుత్ సరఫరా జరిగే మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

అరసవల్లి: జిల్లాలో జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యాల కల్పన శత శాతం జరగాలని..విద్యుత్ శాఖ చర్యల వల్ల ఇంటి నిర్మాణాలు జరగడం లేదనే మాట ఇక వినిపించకూడదని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గుజరాతిపేట సబ్‌స్టేషన్, ఎచ్చెర్ల మండలం కొయ్యాం సబ్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా సిబ్బంది పనిచేయాలని, ఈమేరకు ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్‌కు సూచించారు. జగనన్న కాలనీలను పరిశీలించిన సందర్భంలో అక్కడి పరిస్థితులను మెరుగుపర్చాలని ఈఈ ఎస్.బయ్యన్నాయుడును ఆదేశించారు.

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలు (పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు)ల్లో ప్రవేశానికి నాలుగో విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో బుధవారం వివరాలు వెల్లడించారు. ఎంచుకున్న ఐటీఐకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 19లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సమీప ప్రభుత్వ ఐటీఐల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. 20 లోపు వెరిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. ఈ నెల 22న ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాల కౌన్సెలింగ్, 23న ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాలకు ఐటీఐలను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బంగారు గొలుసు చోరీ

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస పంచాయతీ మెట్టపేట గ్రామ సమీపంలో బుధవారం మూడు తులాల బంగారు గొలుసు చోరీకి గురైనట్లు బాధితురాలు కూన మహాలక్ష్మి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహాలక్ష్మి తన స్నేహితురాలితో కలిసి శుభకార్యానికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని ఇద్దరు యువకులు వెంబడించి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకుపోయారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





● సిద్ధమవుతున్న సిద్ధి గణపతులు

వినాయక చవితి వచ్చేస్తోంది. మండపాల్లో కొలువుదీరేందుకు సిద్ధి గణపయ్యలు కూడా సిద్ధమవుతున్నారు. వర్షాలు కురుస్తున్నా పరదాలు వేసుకుని మరీ వినాయక విగ్రహాలను సుందరంగా తీర్చిదిద్దే పనిలో కార్మికులు నిమగ్నమవుతున్నారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో తయారవుతున్న గణపతులను ఇక్కడ చూడొచ్చు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

వంట తంటాలకు టాటా

- మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన వంట పాత్రలు
- జిల్లా వ్యాప్తంగా 2267 పాఠశాలల్లో పంపిణీకి ఏర్పాట్లు
- ఆరు కేటగిరీలుగా స్కూల్స్ విభజన
- వంట సిబ్బందికి తీరనున్న ఇబ్బందులు



నరసన్నపేట: డ్రాపౌట్లు తగ్గించడం, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర సర్కారు జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వాలు పథకం నిర్వహణను గాలికొదిలేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక పథకం రూపురేఖలు మార్చేశారు. మెనూపై ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా వంట ఏజెన్సీ మహిళల కష్టాలు తీర్చేలా సరైన వంట పాత్రలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల మంజూరుకు ఇప్పటికే ప్రతిపాదనలు సేకరించగా తాజా పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. మరో వారం, పది రోజుల్లో ఈ పాత్రలు స్కూల్స్‌కు చేరనున్నాయి.

గాలికొదిలేసిన గత ప్రభుత్వం..

2010లో చివరి సారిగా మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ తరువాత వచ్చిన టీడీపీ సర్కారు వీటి గురించి అసలు పట్టించుకోలేదు. అరకొర పాత్రలతోనే వంటలు చేయాల్సి వచ్చేది. కొన్ని స్కూల్స్‌లో వంట పాత్రలే లేకపోగా, వాటిని ఏజెన్సీకి చెందిన మహిళలే సమకూర్చుకున్నారు. వంట పాత్రలు లేక ఇబ్బందిగా ఉందని గత ప్రభుత్వ కాలంలో వంట మహిళలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, ఎంత మందికి కలిసినా టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కొత్త పాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.



ప్రభుత్వం సరఫరా చేయనున్న నమూనా వంట పాత్రలు

2267 స్కూళ్లకు మంజూరు..

జిల్లాలో మూడు వేలకు పైగా స్కూల్స్ ఉన్నప్పటికీ 2267 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీల పథకం అమలవుతోంది. ఈ మేరకు వంట పాత్రలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. విద్యార్థుల హాజరు బట్టి వంట పాత్రలు పంపిణీకి స్కూల్స్‌ను 6 కేటగిరీలుగా విభజించారు. గార, శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస మండలాలు(ఇస్కాన్ నిర్వహణ) మినహా మిగిలిన మండలాల్లో స్కూల్స్‌కు వంట పాత్రలు వస్తున్నాయి. గరిష్ఠంగా 25 కిలోల వరకూ అన్నం వండేలా పాత్రలు పంపిణీ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు 2023/24 విద్యా సంవత్సరంలో పాఠశాలల వారీగా ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిర్ణయించిన కేటగిరీల ప్రకారం వంట పాత్రలు కోసం ప్రతిపాదనలు పంపాం. ఈ నెల మూడో వారం నాటికి పాత్రలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వంట పాత్రలు కొత్తవి వస్తే నిర్వాహకుల కష్టాలు దాదాపుగా పరిష్కారమవుతాయి. వంట పాత్రలు పంపిణీ చేయాలనే నిర్ణయం చాలా మంచిది.

– యూ.శాంతారావు, ఎంఈఓ, నరసన్నపేట

చాలా ఆనందిస్తాం..



వంట పాత్రలు 13 ఏళ్ల క్రితం ఇచ్చారు. కొన్నాళ్లకే అవి పోయాయి. స్కూల్లో విద్యార్థులు 460 మంది ఉన్నారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన పాత్ర ఒకటే ఉంది. వంటకు ఇబ్బంది అవుతుంటే మేము ఇతర పాత్రలు సమకూర్చుకున్నాం. ఇప్పుడు అవసరమైన వంట పాత్రలు వస్తాయని హెచ్‌ఎం చెప్పారు. కొత్త పాత్రలు వస్తే ఆనందమే.

– రాధ, వంట ఏజెన్సీ మహిళ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట

హృదయానందం

- గుండె శస్త్రచికిత్సలకు 25 మంది ఎంపిక
- ఉచిత వైద్యసేవలపై హర్షం


చిన్నారులకు గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు


శ్రీకాకుళం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన పి.రామసత్యసాయి అనే ఏడేళ్ల బాలుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పుట్టుకతోనే గుండెలోని రెండు గదుల నాళాలు మూసుకుపోయి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. తల్లి గౌరీశ్వరమ్మ మూగ, బధిర కావటంతో భర్త వదిలిపెట్టేశాడు. గౌరీశ్వరమ్మ సోదరుడు కృష్ణబాబు చొరవతీసుకుని రామసత్యసాయిని రాజాం, విజయనగరం, విశాఖపట్నంలోని ఎన్నో ఆస్పత్రుల్లో చూపించాడు. శస్త్ర చికిత్స అవసరం అవుతుందని చెప్పినా ఏ ఒక్కరూ ఆపరేషన్‌కు సాహసించలేదు. చికిత్స జరిపేందుకు రూ.5లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పినా చిన్నారి ప్రాణాలకు గ్యారంటీ లేదని తేల్చి చెప్పేశారు. ఇలాంటి తరుణంలో తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలుసుకున్న మేనమామ తిరుపతికి తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉండగా.. ఆస్పత్రి వైద్యులే శ్రీకాకుళం జిల్లాకు వస్తున్నారని తెలుసుకుని సంబరపడ్డారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో బుధవారం శిబిరం నిర్వహించటంతో చిన్నారితో పాటు హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించిన రామసత్యసాయిని తక్షణం తిరుపతికి తీసుకురావాలని వైద్యులు సూచించారు. ఇలా.. ఎందరో తల్లిదండ్రులు తమ బిడ్డలను శిబిరానికి తీసుకువచ్చి బుధవారం రిమ్స్‌లో జరిగిన గుండె పరీక్ష శిబిరంలో తనిఖీలు చేయించారు. 75 మందిని వైద్యులు పరీక్షించగా.. 48 మంది గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరిలో 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని, మిగతా 23 మందికి మందుల ద్వారా నయం చేసుకునే అవకాశం ఉందని నిర్ధారించారు. అత్యవసరంగా శస్త్రచికిత్సలు అవసరమైన వారిని తక్షణం తిరుపతి తీసుకురావాలని చెప్పారు. మిగిలిన వారికి ఎప్పుడు రావాలో తేదీలతో సహా తెలియజేశారు. రూ.లక్షలు ఖర్చు చేసిన నయం అవుతుందో లేదో తెలియకపోగా.. తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో అపాయింట్‌మెంట్ లభించడం కష్టమని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆస్పత్రి వైద్యులే జిల్లాకు వచ్చి తనిఖీ చేయటంతో పాటు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు చెప్పటంతో గుండె వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హృదయచంద్ర, డాక్టర్ ఎస్ చైతన్య, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ కుశమలత, మేనేజర్ డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ బొడ్డేపల్లి సత్యవతి తదితరులు పాల్గొనగా.. శిబిరం సమన్వయ అధికారి డాక్టర్ సి.పి శ్రీదేవి పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం


పార్టీలో చేరిన వారితో స్పీకర్ తమ్మినేని సీతారాం, నాయకులు

పొందూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న విధానాలు, ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమం నచ్చి బీజేపీ, జనసేన, టీడీపీల నుంచి 75 కుటుంబాలు బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరందరికీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ పార్టీ కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్ సమన్వయంతో పార్టీలో చేరారు. బీజేపీ నుంచి పొందూరు మండల ఉపాధ్యక్షుడు ఎం.చిట్టిబాబు, చేనేత విభాగం మండల అధ్యక్షుడు ఎం.హేమసుందర్, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ డి.రామచంద్రరావు, బుడ్డెపు నాగేశ్వరరావు, వసంత రాజేశ్వరి, ఫార్మసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఎస్ రాజు, జనసేన శ్రీకాకుళం రూరల్ మండల కన్వీనర్ ఎస్.శంకర్, టీడీపీ నుంచి పేడాడ ఆదినారాయణ, పేడాడ ఆనందరావు, సువ్వారి శ్రీను, సువ్వారి నీలారావ తదితరు లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, నాయకులు వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, జేవీఆర్, అనకాపల్లి గోవిందరావు, వండాన సూరపునాయుడు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం పెంపొందించేలా పాలన


గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): పేద ప్రజల ఆత్మగౌరవం పెంపొందించేలా రాష్ట్రంలో పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని చౌదరి సత్యనారాయణ కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆ రోజు పాదయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పారు. బడుగుల బలహీన వర్గాల ఆత్మగౌరవం పెంచేలా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలను కంటికి రెప్పలా చూసుకునే వలంటీర్లను నియమించామన్నారు. ఓట్ల కోసం ఆలోచన చేసేది టీడీపీ అని, ఎన్నికల ముందు చెప్పినవన్నీ అమలు చేస్తున్నది వైఎస్సార్‌సీపీ అని పేర్కొన్నారు. మార్కెట్‌ను బాగు చేశామని, ఆస్పత్రిలో 900 బెడ్స్ అందుబాటులో ఉంచామని, 6 అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేశామని, ఇది అభివృద్ధి కాదా..అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే జనవరిలోగా చౌదరి సత్యనారాయణ కాలనీ వార్డులో మిగిలిన పనులు అని పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సాధు వైకుంఠ రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా అలివేలు మంగ, గని రాజు, ఎన్ని ధనుంజయ్, పైడి రాజారావు, మండవిల్లి రవి, ధర్మాన రఘు, రూప గిరి, ఎం.ఎ.బేగ్.లావెటి శ్యామ్ తేజ, శోభన్, సుగుణ రెడ్డి, గాయత్రి, జ్యోతి, కామేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఉద్దానం


మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

మందస: మండలంలోని భేతాళపురం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరాయి. టీడీపీ నాయకురాలు జుత్తు రేవతి ఆధ్వర్యంలో సుమారు 12 కుటుంబాలకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానంలో నాలుగేళ్లుగా మంత్రి అప్పలరాజు చేస్తున్న అభివృద్ధి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమయ్యామన్నారు. రానున్న ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు జుత్తు పాపారావు, జుత్తు నారాయణ, ఋషి, బొడ్డు చిన్నారావు, గుంటు కపిల్, ఎం.ఎస్.మూర్తి, దున్న బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ ఆప్షన్ల నమోదు



ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్–2023 ఎంపీసీ స్ట్రీం ఇంజినీరింగ్ తుది విడత కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం నుంచి కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ సహాయ కేంద్రంలో బుధవారం వివరాలు వెల్లడించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు అనంతరం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో గురువారం నుంచి 16వ తేదీ వరకు కళాశాలల ఆప్షన్ల ఎంపిక, బ్రాంచ్‌ల ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 17న ఆప్షన్ల మార్పునకు అవకాశం, 21న సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత 22 నుంచి 25 మధ్య కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఆప్షన్ల నమోదులో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వంశధారలో స్వల్పంగా పెరిగిన వరద


గొట్టాబ్యారేజీ వద్ద దిగువకు విడిచిపెట్టిన నీరు

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టాబ్యారేజీ వద్ద బుధవారం ఉదయానికి స్వల్పంగా వరదనీరు పెరిగింది. క్యాచ్‌మెంట్ ఏరియాలోతోపాటురెండు రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టా బ్యారేజీ వద్ద 38.10 మీటర్ల నీటి మట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో సుమారు ఆరేడు వేల క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ఉదయానికి 12862 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన నీటిని 14 గేట్లు 20 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి దిగువకు విడిచిపెట్టినట్లు ఇన్‌చార్జి డీఈ అనిల్‌కుమార్ తెలిపారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 705 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 2049 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు చెప్పారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో కాట్రగడ వద్ద 36.2 మిల్లీమీటర్లు, గొట్టా వద్ద 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డీఈ వివరించారు.

ఐదు సామాజిక వర్గాలకు మద్దతుగా..


జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగాధర్ అహిర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి/కవిటి: జిల్లాలో ప్రధాన సామాజిక వర్గాల్లో ప్రముఖంగా ఉన్న తూర్పుకాపు, శిష్టకరణం, కళింగ కోమటి, సొండి, అరవ కులాలను ఓబీసీ జాబితాలో చేర్పించాలని కోరుతూ ఆయా కుల సంఘాల ప్రతినిధులు చాలా కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ బీసీ కమిషన్ ఆయా కులాల స్థితిగతులను క్షుణ్ణంగా తెలుసుకొని, సామాజికవర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో కలిసి దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం హియరింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కుల సంఘాల ప్రతినిధులతో కలిసి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ హాజరయ్యారు. జిల్లా తరఫున ఈ ఐదు సామాజిక వర్గాలకు మద్దతుగా నిలిచి, వీరిని ఓబీసీ జాబితాలో చేర్పించాల్సిందిగా కోరుతూ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగాధర్ అహిర్‌కు వినతిపత్రం అందించారు. ఆయా వర్గాలకు అనుకూలంగా వాదనలు విన్పించారు. వెనుకబడిన వర్గాల జాబితాలో ఉన్న ఈ కులాలను ఎట్టి పరిస్థితుల్లో ఓబీసీ జాబితాలో చేర్పించి, ఆయా వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఓబీసీలో చేర్పితే ఆయా వర్గాలకు చెందిన పిల్లల చదువు, జాతీయ స్థాయిలో ఉద్యోగాల విషయంలో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మహా లింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాసశివరాత్రి మహా పర్వ శివ పంచాయతన సహిత మహా లింగార్చన బుధవారం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆదాయం రూ.5.69 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.5,69,372 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 60 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఆలయ హుండీని బుధవారం ఉదయం లెక్కించామని చెప్పారు. శ్రీకాకుళం సహాయ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు జి.వి.బి.ఎస్ రవి కుమార్ పర్యవేక్షించగా.. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నేతాజీ, కృష్ణారావు, నాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారంలోగా అపరాధ రుసుం కట్టిస్తాం



సెబ్ జేడీ విజయ నాగమణికంఠ

శ్రీకాకుళం క్రైమ్ : వివిధ మద్యం కేసుల్లో పట్టుబడి చార్జిషీటు ఫైల్ కాని వాటికి (కాంపౌండింగ్ కేసులు) మరో వారం రోజుల్లో అపరాధ రుసుం కట్టిస్తామని జిల్లా స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ జేడీ విజయ నాగమణికంఠ బుధవారం తెలిపారు. 550 మంది ఇప్పటివరకు అంగీకార పత్రాలు (అప్రూవల్) సమర్పించారని, ఇంకా కట్టేందుకు సిద్ధంగా ఉన్నవారికోసం మరో వారం రోజులు వేచి చూసి అప్రూవల్ తీసుకుని ఫీజులు కట్టిస్తామన్నారు. పట్టుబడిన మద్యం సీసాలను బట్టి బ్యాంకులో చలానాలు తీసుకుని సెబ్ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షునిగా రాపాక



రాపాక చిన్నారావు

కాశీబుగ్గ: జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షునిగా రాపాక చిన్నారావు యాదవ్‌ని నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ యానిమాల్ హస్బెండ్రీ డిపార్ట్‌మెంట్ తరపున రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నారావు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో ఉద్దాన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జిల్లా యాదవ కుల సంక్షేమం అభివృద్ధికి అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారావును పార్టీ నాయకులు, యాదవులు అభినందనలు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



పెచ్చులూడిన శ్లాబ్

సంతబొమ్మాళి: ఇటీవల కురిసిన వర్షాలకు భావనపాడు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో ఇంటి పైకప్పు పెచ్చులూడింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో తృటిలో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు కోయిల తిరుమలరావు రాత్రి ఇంటిలో పడుకుని పొద్దున్నే బయటికి రాగానే పెద్దశబ్దంతో పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్లాబు బాగా తడిసిపోవడంతో పెచ్చులూడి పడిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

సమైక్యతా వారధి హిందీ

- నేటి నుంచి హిందీ పక్షోత్సవాలు
- జిల్లాలో హిందీ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహణ



నరసన్నపేట: సుందరాపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో హిందీ 'అ' ఆకృతిలో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో జాతీయ సమైక్యతకు హిందీ భాష ఎంతగానో దోహదపడుతోంది. ఉత్తర, దక్షిణ భారత దేశాల వారధిగా కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ భాషగా, కేంద్ర ప్రభుత్వ భాష (రాజభాష)గా భిన్న భాషల మధ్య అనుసంధానకర్తగా విశేష సేవలు అందిస్తోంది. భిన్న భాషల భారతావనిలో జాతీయ భాష ఉండాలని తలచిన జాతీయ నేతలు గాంధీజీ, కావేల్కర్, తిలక్ తదితరులు హిందీని జాతీయ భాషగా చేయాలని దేశవ్యాప్తంగా ఉద్యమించి సఫలీకృతులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1925 నుంచి హిందీ భాష ప్రచారం ఊపందుకుంది. హిందీ ప్రచార సభ హైదరాబాద్, దక్షిణ భారత హిందీ ప్రచార సభల ద్వారా హిందీ భాషా ప్రచారం జోరుగా సాగుతోంది.

జిల్లాలో హిందీ ప్రచారం..

జిల్లాలో మొదటిగా పుణుగుపాటి జోగారావు బృందావనం మాస్టారు, బెహరా ఉమామహేశ్వరరావు, పెంట లక్ష్మణశర్మ, ఎస్.బాలకృష్ణమూర్తి తదితరులు హిందీ భాష ప్రచారానికి కృషి చేశారు. ప్రస్తుత తరంలో మందపల్లి రామకృష్ణారావు, కోనే శ్రీధర్ తదితరులు హిందీ ప్రచారానికి కృషి చేస్తున్నారు. పాలకొండకు చెందిన డాక్టర్ సి.ఎల్.నాయుడు జిల్లాకు తొలిసారిగా హిందీ టీచర్ ట్రయినింగ్ కాలేజీని తీసుకువచ్చారు. కోనే శ్రీధర్ జిల్లాలో 'హిందీ దివస్' ఉత్సవం ప్రారంభించారు. 1992 నుంచి నేటికీ కొనసాగిస్తున్నారు. హిందీకి తగిన ప్రోత్సాహం అందించాలని, ఎల్పీసెట్ ద్వారా హిందీ పండిత శిక్షణ ప్రవేశాలను తక్షణమే పునరుద్ధరించాలని, సెకండరీ స్థాయి వరకు త్రిభాషా సూత్రాన్ని పటిష్టంగా అమలు పరచాలని, ఎలిమెంటరీ స్థాయి నుంచి హిందీ భాష బోధన ప్రవేశపెట్టాలని, అదనపు హిందీ పండిట్ పోస్టులు మంజూరు చేయాలని శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్షోత్సవాలు ఇలా..

ఈ నెల 14న శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్(ఎన్‌సీఎస్)లో హిందీ దివస్ పక్షోత్సవాలు ప్రారంభమవుతాయి. విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలిమహంతి జగన్మోహనరావులు పాల్గొంటారు. ఈ నెల 16న ఎంపీపీ స్కూల్ కల్లేపల్లి (శ్రీకాకుళం రూరల్ మండలం)లో, 19న జెడ్పీ హైస్కూల్ బెజ్జిపురం (లావేరు మండలం)లో, 20న జెడ్పీ హైస్కూల్ అక్కులపేట (ఆమదాలవలస మండలం)లో, 22న బలగలోని ఆదిత్య విద్యా నిలయంలో హిందీ దివస్ కార్యక్రమాలు జరుగుతాయి. ముగింపు కార్యక్రమం ఈ నెల 28న విశాఖపట్నంలో నిర్వహించేలా హిందీ మంచ్ చర్యలు తీసుకుంది.

భాషాభివృద్ధికి చర్యలు..



హిందీ ప్రచారసభ హైదరాబాద్‌ఆధ్వర్యంలో హిందీ విశారద, భూషన్, విద్వాన్ తదితర పరీక్షలు జపిస్తున్నాం. దక్షిణభారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– దొంతం పార్వతీశం, జిల్లా అధ్యక్షుడు, హిందీ మంచ్

విజయవంతం చేయాలి..



ఏటా హిందీ మంచ్ ఆధ్వర్యంలో హిందీ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో 14 నుంచి 28వ తేదీ వరకు హిందీ వేడుకలను జరిపిస్తున్నాం. వీటిని విజయవంతం చేయాలి.

– రొంపివలస రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి

హిందీతో జాతీయత



హిందీ భాషాభివృద్ధిలో భాగంగా సెప్టెంబరు 14 నుంచి 28 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. హిందీ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– కోనె శ్రీధర్, హిందీ మంచ్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త

ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి



ప్రతి ఒక్కరూ హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలి. ఉత్తర భారతదేశం వెళ్లాలన్నా, అక్కడ స్థిరపడాలన్నా హిందీ భాష రాకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హిందీ మంచ్ ప్రచారం అభినందనీయం.

– వి.కొండలరావు, ఎన్‌టీటీ క్లబ్ సభ్యుడు, పొందూరు

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

న్యూ సెంట్రల్ స్కూల్,
పి.ఎన్.కాలనీ, శ్రీకాకుళం.
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 95503 11265

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, డీసీహెచ్‌ఎస్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్లు, పంచాయతీ, ఐసీడీఎస్ అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు జిల్లాలో సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను తెలుసుకోవడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మ్యాపింగ్ చేశామన్నారు. వలంటీరు ప్రతి ఇంటికీ వెళ్లి గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరం తేదీపై ముందుగా అందరికి తెలిసేలా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో వైద్యుల నియామకం, తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ప్రకాశరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు వచ్చేశాయ్..!



నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: జిల్లావ్యాప్తంగా కొత్త పింఛన్ల సందడి నెలకొంది. అర్హులైన లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పింఛన్లు అందిస్తున్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా మండలానికి మంజూరైన 233 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మత, పార్టీ, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రాంబాబు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్ శంకరబాబు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బార్ల వేణుగోపాల్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్స్ ఫుట్‌బాల్ ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు కలక్టరేట్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం హెచ్ గ్రౌండ్‌లో ఎంపికలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. పూర్తివివరాలకు నవీన్‌కుమార్ (సెల్: 7386956065)ను సంప్రదించాలని కోరారు.

17న జోనల్ స్థాయి ఎంపికలు..

ఎంపికైన జిల్లా జట్టును ఈ నెల 17న ఉత్తరాంధ్ర జిల్లా(శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం)లతో కూడిన జోనల్‌స్థాయి ఎంపికలకు పంపించనున్నట్టు శ్రీనివాస్ చెప్పారు. జోనల్‌స్థాయి ఎంపికలు రణస్థలంలోని ఎన్ఈఆర్ స్కూల్ మైదానంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ ఆదేశాల మేరకు డిగ్రీ, పీజీ కోర్సుల బోధనకు మొత్తం 15 పోస్టులు భర్తీ చేస్తున్నట్టు చెప్పారు. తెలుగు యూజీ–1, రాజనీతి శాస్త్రం యూజీ–1, హిస్టరీ యూజీ–1, కామర్స్ యూజీ–5, కంప్యూటర్ అప్లికేషన్స్–1, జువాలజీ–1, బోటనీ–1, ఫిజికల్ ఎడ్యుకేషన్–1, ఒరియా–1, ఎలక్ట్రానిక్స్–1, ఫిలాసఫీ–1 పోస్టులు భర్తీ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. పీజీలో 55 శాతం ఉత్తీర్ణత కలిగి పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హతలు కలిగినవారు అర్హులని తెలిపారు. ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని, 20న ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ జి.రాజశేఖర్ (సెల్: 9000506595)ను సంప్రదించాలని కోరారు.

చంద్రబాబు స్కిల్ ఫెయిలైంది

- తప్పుచేస్తే శిక్ష తప్పదని ప్రజలకు తెలిసింది
- వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్



డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసి 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ చెప్పుకుంటున్న చంద్రబాబు వ్యవస్థలను సైతం మేనేజ్‌చేయడంలో ఎంతో స్కిల్ ఉన్నా స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో మాత్రం అరెస్టయ్యారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. అవినీతి చేయడం, వాటిని మేనేజ్ చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. ఎన్ని పాపాలు చేసినా ఏదో ఒకరోజు దొరికిపోక తప్పదని, బాబు అరెస్ట్‌తో అది రుజువైందన్నారు. దేశంలోనే పేరుగాంచిన సుప్రీంకోర్టు న్యాయవాదులు సైతం బాబు అరెస్ట్‌ను అడ్డుకోలేకపోయారంటే ఆయన ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో చట్టం ముందు అందరూ సమానమేనన్న భావన సామాన్య ప్రజల్లో సైతం న్యాయస్థానం కల్పించందన్నారు. నిరుద్యోగులను నిట్టనిలువునా మోసం చేసిన బాబుకు వారి ఉసురే తగిలిందన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని, వారిని టీడీపీ నాయకులు ఏమార్చే ప్రయత్నం చేసినా విఫలమయ్యారని దుయ్యబట్టారు. మొన్నటి బంద్‌కు వచ్చిన స్పందనే అందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు చేసిన తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడాలన్నారు.

కరువు ప్రాంతాల్లో పర్యటన



కర్తలి వద్ద ఎండిపోయిన వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కంచిలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది కంచిలి మండలంలో ఇంతవరకు ఉభాలు కాని గ్రామాలను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కె.శ్రీధర్ బుధవారం పరిశీలించారు. మండలంలో కనీస స్థాయిలో కూడా వర్షపాతం నమోదు కాకపోవడంతో ఇంతవరకు చాలా గ్రామాల్లో ఉభాలు పడలేదు. వాస్తవానికి 5500 ఎకరాలు వరకు ఉభాలు జరగాల్సి ఉండగా, వర్షాభావ పరిస్థితులతో 2,364 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ వివరించారు. కేవలం వర్షాధారంతోనే పంటలు సాగుచేయడం జరుగుతోందని కర్తలి, మఠం సరియాపల్లి, దాలేశ్వరం, రాగుపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తామని జేడీ తెలిపారు. ప్రతి రైతు తమ పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, సోంపేట ఏడీఏలు భవానీశంకర్, జగన్మోహనరావు, వ్యవసాయ సహాయకులు విద్యాసాగర్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాముకాటుతో ఆటోడ్రైవర్ మృతి



బుగ్గల భీమారావు(ఫైల్)

మందస: మండలంలోని జిల్లుండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుగ్గల భీమారావు(49) పాము కాటుకు గురై మరణించాడు. మంగళవారం రాత్రి ఇంటిలో పడుకున్న భీమారావు కాలుపై ఏదో కరిచినట్టు అనిపించడంతో గాయంపై పసుపు రాసి మళ్లీ పడుకున్నాడు. వేకువజామున విషం పాకడంతో ఊపిరి తీసుకోవడానికి కష్టమవుతున్న తరుణంలో కుటుంబసభ్యులు హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో భీమారావును టెక్కలి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మరణించాడు. భీమారావుకు భార్య హేమలత, కుమారుడు ఆకాశ్, కుమార్తె మౌనిక ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన భీమారావు మృతితో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఈయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా సేవలందించారు. సర్పంచ్ చింతాడ శ్రీకావ్య, పార్టీ సీనియర్ నాయకుడు శిస్టు బాపూజీ, సచివాలయం కన్వీనర్ డొక్కరి పాపారావు, పార్టీ నాయకులు భీమారావు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

ఎన్‌ఎంయూకు గుర్తింపుపై హర్షం



మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి వై.అప్పయ్య

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అతిపెద్ద యూనియన్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషకరమని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శిమ్మయ్య అన్నారు. ఆర్టీసీ ఎన్ఎంయూకు గుర్తింపు వచ్చిన సందర్భంగా రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ఎన్ఎంయూ కార్యాలయంలో శ్రీకాకుళం 1, 2 డిపోల ఎన్ఎంయూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిమ్మయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల అభివృద్ధి, శ్రేయస్సుకు ఎన్నో ఏళ్లగా ఎన్ఎంయూ కృషి చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.కె.రావు, కార్యదర్శి వై.అప్పయ్య, 2డిపో కార్యదర్శి వి.శాంతరాజు, 1వ డిపో అధ్యక్షుడు కె.నర్సింహులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఆర్.ఎస్.పట్నాయక్, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆనందంలో అన్నదాత



బూర్జపాడు పంట పొలాల్లోకి చేరిన నీరు

ఇచ్ఛాపురం రూరల్: గత రెండు రోజులుగా కురిసిన మోస్తరు వర్షానికి బాహుదా నదిలోకి వరద నీరు చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో వరినారు దాదాపుగా ఎండిపోయిన పరిస్థితికి వచ్చేసింది. ఈ తరుణంలో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరింది.

అంతే కాకుండా బాహుదానదిలోకి నీరు చేరడంతో కెనాల్స్ ద్వారా పారే నీటిని రైతులు మోటారు సహాయంతో సాగునీటిని పంట పొలాల్లోకి మళ్లించే పనిలో నిమగ్నమయ్యారు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discontinued) Exams in September/October ✆ : 73383 76874 [R.98]

WANTED

■ Wanted B.Com Male Graduates with experience in Tally & Accounts works in Srikakulam (Local). Cont: 8331018121 [S.5586]

■ జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ Recovery సంస్థలో పనిచేయుటకు ఆసక్తిగల యువకులు కావలెను. MALE (కలెక్షన్ & లేపో ఎగ్జిక్యూటివ్స్) కావలెను. Q: 10th - డిగ్రీ ✆ 77991 11097, 98857 95967. W/A 779911 1098 [O-191615]

■ రైల్వే పనుల కొరకు పావని కన్‌స్ట్రక్షన్ తిరుపతి నందు వివిధ ప్రాంతాల్లో పని చేయుటకు Diploma/B.Tech సివిల్ ఇంజినీర్స్, సూపర్‌వైజర్స్ కావలెను. ✆ 8317695424 [T-1225286]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్: Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA-612]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.